సాక్షి
విశాఖపట్నం
గురువారం । 19 । జూన్ । 2025


నృత్య కళ.. ప్రతిభ భళా 10లో


యోగాంధ్రకు ముమ్మర ఏర్పాట్లు 10లో


ఆధ్యాత్మిక యోగం 10లో

న్యూస్‌రీల్

యోగా వేడుకలకు విదేశీ విద్యార్థులు


యోగా సాధన చేస్తున్న విదేశీ విద్యార్థులు

విశాఖ సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన విదేశీ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. కొన్ని రోజులుగా విదేశీ విద్యార్థులకు ఏయూ యోగా విభాగం పరిశోధకులు, పీజీ విద్యార్థులు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు 21న బీచ్‌రోడ్డులో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొననున్నారు. ఏయూ తరఫున సుమారు 200 మంది విదేశీ విద్యార్థులు హాజరవుతున్నారు.

ప్రజల రవాణా సదుపాయంపై సమీక్ష


సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి నారాయణ

మహారాణిపేట: యోగా వేడుకలకు హాజరయ్యే ప్రజలకు కల్పించే రవాణా సదుపాయాలపై మంత్రులు సమీక్షించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ప్రజలు సులభంగా ఆయా వేదికల వద్దకు చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కేటాయింపు, తరలింపు, పార్కింగ్ తదితర విషయాల్లో అనుసరిస్తున్న విధానాలపై అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ, విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

21న అందరి చూపు.. విశాఖ వైపు

మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా మన సంప్రదాయానికి ప్రతిరూపం మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి ఆరోగ్యకర జీవనశైలిలో భాగమన్నారు. ప్రధాని మోదీ కృషితోనే యోగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని పేర్కొన్నారు. విశాఖలో జరిగే యోగా వేడుకలకు 175 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారని వెల్లడించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

మహారాణిపేట: ఏయూలోని యోగాంధ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను బుధవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత పరిశీలించారు. అక్కడి నుంచి ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలో సీసీ కెమెరాలు, నిఘా కోసం డ్రోన్లు ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపు వంటి అంశాలపై దృష్టి సారించి.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వీవీఐపీ బసల్లో స్వల్ప మార్పులు

మహారాణిపేట: ఈ నెల 20, 21 తేదీల్లో విశాఖలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమం కోసం వీవీఐపీల బసలో కొన్ని మార్పులు చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు బసను నోవాటెల్ హోటల్ నుంచి పోర్ట్ గెస్ట్ హౌస్‌కు మార్చారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బసను పోర్ట్ గెస్ట్ హౌస్ నుంచి అటవీ శాఖ గెస్ట్ హౌస్(త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) మార్పు చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు నోవాటెల్ హోటల్‌ను కేటాయించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు జూన్ 18వ తేదీ నుంచి, రాయగడ–గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్‌కు జూన్ 19వ తేదీ నుంచి ఒక స్లీపర్ క్లాస్, ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను, చర్లపల్లి–బ్రహ్మపూర్(07027/28) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.

అధికార పార్టీలో భూ ప్రకంపనలు!

సర్వే నెంబర్ల వారీగా వివరాలు..!	ప్రాంతం	సర్వే నెంబరు	ప్రాంతం	సర్వే నెంబరు
	మధురవాడ	370/1	ముడసర్లోవ	31-2
	మధురవాడ	352/3	మధురవాడ	367/1
	తలారివానిపాలెం	35/4	తర్లువాడ	3/3
	కొమ్మాది	150/2	ఎస్ఆర్ పురం	99
	శనివాడ	92	కొమ్మాది	114/1
			వర్లపూడి	122/1

సీతయ్య వ్యవహారంపై కూటమి నేతల కినుక

- అధిష్టానం పేరుతో వ్యవహారాలు నడుపుతున్నారంటూ మండిపాటు
- స్థానిక నేతలకూ మరకలు అంటించడంపై ఆగ్రహం
- ఎండాడ వ్యవహారంపై గంటా సీరియస్
- విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖ
- పక్కాగా విచారిస్తే సీతయ్యతో పాటు కీలక వ్యక్తుల ప్రమేయం బట్టబయలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అధికార పార్టీలో 'భూ'ప్రకంపనలు మొదలయ్యాయి. అధిష్టానం పెద్దలు తెలుసంటూ సీతయ్య చేస్తున్న భూ వ్యవహారాలపై స్థానిక నేతలు మండిపడుతున్నారు. తమ దృష్టిలో కనీసం పెట్టకుండా వ్యవహారాలు కానివ్వడమే కాకుండా ఆ మరకలు తమకు కూడా అంటించేలా ప్రయత్నం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండాడలోని ఐదు ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో పాటు రికార్డులు సరిగా లేని వ్యక్తికి వచ్చే విధంగా చక్రం తిప్పారు. ఇందుకుగాను రెండు ఎకరాల మేరకు సదరు నేతకు లబ్ధి చేకూరేలా వ్యవహారం నడిచిందనే విమర్శలున్నాయి. ఈ భూ వ్యవహారంలో స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేరును కూడా సదరు నేత లాగే ప్రయత్నం చేసినట్లు అధికార పార్టీలో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో సీతయ్యపై గంటా సీరియస్ కావడంతో పాటు.. ఈ భూవ్యవహారాన్ని తేల్చాలంటూ నేరుగా కలెక్టరుకు లేఖ రాయడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. అధిష్టానానికి దగ్గరగా ఉండే నేతల పేర్లు చెబుతూ సీతయ్య నడిపిన వ్యవహారంతో పాటు ఎండాడ భూ వ్యవహారంలో జరిగిన రికార్డుల మార్పిడి తంతు కూడా బయటపడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా మధురవాడ, కొమ్మాది, ఎస్ఆర్ పురం ఇలా మొత్తం 11 సర్వే నెంబర్లలోని భూములపై సదరు నేత కన్నుపడినట్టు చర్చ నడుస్తోంది. కీలక వ్యక్తుల ద్వారా పనికానిస్తానంటూ రికార్డులన్నీ తీసుకుని వ్యవహారాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

రికార్డుల్లో ఒకరు.. లబ్ధిదారు మరొకరు..!

వాస్తవానికి ఎండాడలోని భూమి వ్యవహారంపై ఇప్పటికే అనేక విమర్శలున్నాయి. ఏప్రిల్ 12, 18వ తేదీల్లో 'సాక్షి' వరుస కథనాలను కూడా ప్రచురించింది. అడంగల్‌తో పాటు రికార్డులన్నీ మార్చేశారని పేర్కొంటూ ఆధారాలతో సహా వివరించే ప్రయత్నం చేసింది. గతంలో కలెక్టరు పంపిన గెజిట్‌లో ఉన్న పేరుకు... తాజాగా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఆదేశాల్లో మరో పేరు పేర్కొన్నారు. ఎండాడలోని 14/1 సర్వే నెంబరులో 5.10 ఎకరాల భూమి ఉంది. ఇది ప్రభుత్వ భూమిగా ఉందని.. అయితే, డీ–పట్టా సీతారామయ్య పేరు ఉందని పేర్కొంటూ స్వయంగా కలెక్టర్ గెజిట్‌లో పేర్కొన్నారు. అయితే, ఇదే సర్వే నెంబరులోని భూమిని వై.బాలిరెడ్డికి అసైన్ చేశారని, ఆయన కుమారుడు వై.జోజిరెడ్డికి చెందుతుందని పేర్కొంటూ.. నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నందున రిజిస్ట్రేషన్లు చేయవచ్చంటూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మార్చి 12వ తేదీన పలువురు వ్యక్తులతో డెవలప్‌మెంట్ కమ్ జీపీఏ చేసుకుంటూ రిజిస్ట్రేషన్ల తంతును కూడా కానిచ్చారు. ఈ వ్యవహారమంతా సదరు సీతయ్య ద్వారా నడిచిందని అధికార పార్టీలో బహిరంగంగానే చర్చ నడుస్తోంది. అంతేకాకుండా నేరుగా కీలక వ్యక్తుల ద్వారా పనికానిచ్చారని కూడా వ్యాఖ్యానించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే గంటాకు కూడా పాత్ర ఉందనే కోణంలో సదరు సీతయ్యనే ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన గంటా తాజాగా ఈ భూవ్యవహారంపై లోతైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు లేఖలో కోరారు. దీంతో సదరు సీతయ్య వ్యవహారం మొత్తం బయటకు వస్తుందా? లేదా అనేది చూడాల్సి ఉంది. వీటితోనే ఆగకుండా మరి కొన్ని సర్వే నెంబర్లపైనా సదరు సీతయ్య గురి ఉందని తెలుస్తోంది.



సాక్షిలో ప్రచురితమైన కథనాలు

ఈ భూములపైనే వ్యవహారాలు

రాష్ట్రంలో భూముల ధరలు అధికంగా విశాఖపట్నం జిల్లాలో ఉన్నాయి. ప్రతీ సర్వే నెంబరుకు ఏదో ఒక సమస్య వెంటాడుతోంది. ప్రధానంగా పెందుర్తి, మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో ఇలాంటివి కోకొల్లలు. ఇవే ఇప్పుడు అధికార పార్టీకి చెందిన నేతకు వరంగా మారింది. తనకు అధిష్టానంలోని కీలక వ్యక్తులతో దగ్గరి సంబంధాలు ఉన్నాయని... వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చేస్తానని.. చెరో సగం వాటా తీసుకుందామని ఒప్పందాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విధంగానే ఎండాడలోని భూవ్యవహారం చక్కబెట్టిన అతడు ఇతర భూములపై కూడా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రధానంగా మధురవాడలో 3 సర్వే నెంబర్లు, కొమ్మాది, పెందుర్తిలోని భూములపై సదరు నేత కన్ను పడింది. వీటిపై ఇప్పటికే పలు దఫాలుగా రెవెన్యూ వర్గాలతో చర్చలు నడిపి.. డీల్ కుదుర్చుకున్నట్టు కూడా ప్రచారం జరిగింది. కలెక్టరు కాస్తా అసలు గుట్టును కనిపెట్టడంతో కొద్దిరోజులుగా వ్యవహారాలు నిలిచిపోయినట్టు ప్రచారం జరుగుతోంది. కీలక వ్యక్తులతో తనకున్న పరిచయాల ద్వారా పనికానిస్తానంటూ సదరు సీతయ్య నమ్మబలుకుతున్నట్టు తెలుస్తోంది.

20, 21 తేదీల్లో పాఠశాలలకు సెలవు

ఆరిలోవ: యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లాలోని పాఠశాలలకు రెండు రోజుల కాంపెన్సేటరీ సెలవులు ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు సెలవులు పాటించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పాఠశాలల్లోనూ యోగా కార్యక్రమాలు విధిగా చేపట్టాలన్నారు. ఆ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈవో ఆదేశించారు.

ఆ 2 రోజుల్లో చేపల వేట బంద్

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు సముద్ర తీరంలో చేపల వేటను నిలిపివేస్తున్నట్లు మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు తెలిపారు. తీర ప్రాంతంలో రక్షణ దృష్ట్యా ఈ నెల 20, 21 తేదీల్లో ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు గల తీర జలాల్లో చేపల వేట నిషేధం అమలవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు వాక్‌థాన్

మహారాణిపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఆరు గంటలకు బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఏయూ కన్వెన్షన్ హాల్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద యోగాసనాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు 2 మైదానాలు కేటాయింపు

ఏయూ క్యాంపస్: యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా పరిధిలోని 12 వేల మందికి పైగా ఇంటర్ విద్యార్థులు పాల్గొంటారని ఆర్ఐవో పి. మురళీధర్ తెలిపారు. ఇంటర్ విద్యార్థుల కోసం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఐదు కంపార్ట్‌మెంట్‌లు, గీతం వైద్య కళాశాల మైదానంలో ఆరు కంపార్ట్‌మెంట్‌లను కేటాయించారు. నగరంలోని విద్యార్థులను ఏయూ మైదానానికి, మధురవాడ, భీమిలి తదితర ప్రాంతాల విద్యార్థులను గీతం కళాశాల మైదానానికి తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 188 జూనియర్ కళాశాలలు ఉండగా, వాటిలో 57 కళాశాలల నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే పలు కళాశాలల్లో విద్యార్థులతో యోగాసనాలను సాధన చేయించారు.

విద్యార్థులకు యోగా కష్టాలు

నిలిచిపోయిన ధ్రువీకరణ పత్రాల జారీ

సర్టిఫికెట్ల కోసం పడిగాపులు

మహారాణిపేట: నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల హడావుడి.. విద్యార్థులకు సర్టిఫికెట్ల కష్టాలను తెచ్చిపెట్టింది. పాఠశాలలు, కళాశాలలు తిరిగి ప్రారంభమైన ఈ కీలక సమయంలో ప్రవేశాలు, ఇతర విద్యా అవసరాల కోసం తప్పనిసరి అయిన ధ్రువపత్రాలు సకాలంలో అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యోగా దినోత్సవ ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు నిమగ్నం అవ్వడంతో, ప్రజలకు అత్యవసరమైన సేవలు అందించే జీవీఎంసీ, రెవెన్యూ శాఖల్లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

విశాఖలో ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను జిల్లా యంత్రాంగం..ముఖ్యంగా రెవెన్యూ అధికారులకు అప్పగించింది. దీంతో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు సహా ఇతర సిబ్బంది కొన్ని రోజులుగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం లేదు. ఇదే సమయంలో విద్యాసంస్థలు తెరుచుకోవడంతో అడ్మిషన్ల కోసం ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయాలకు తరలి వస్తున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నం, ములగాడ వంటి నగరంలోని అన్ని ప్రధాన తహసీల్దార్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సిబ్బందిని అడిగితే 'మీ దరఖాస్తు ఆర్.ఐ వద్ద పెండింగ్‌లో ఉంది'లేదా 'ఫైల్ తహసీల్దార్ వద్ద ఉంది' వంటి సమాధానాలు వస్తున్నాయి. అయితే ఆ అధికారులు ఎక్కడున్నారో, ఎప్పుడు వస్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. అడ్మిషన్ల గడువు సమీపిస్తున్న తరుణంలో సర్టిఫికెట్లు చేతికి అందకపోవడంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. యోగా కార్యక్రమం ముఖ్యమే కావచ్చు.. కానీ తమ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సర్టిఫికెట్ల జారీని ఇలా నిర్లక్ష్యం చేయడం సరికాదని విద్యార్థులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తమకు సర్టిఫికెట్లు అందేలా చూడాలని కోరుతున్నారు. ఇక ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం వచ్చే కుటుంబ సభ్యులు కూడా ఆర్ఐ లేదా ఆర్ఐ అసిస్టెంట్ అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

హైవేపై హడల్!

- యోగాంధ్ర ఏర్పాట్లతో బీచ్‌రోడ్డు మూసివేత
- దీంతో రహదారిపై పెరిగిపోయిన వాహనాల రద్దీ
- కిలోమీటర్ మేర నిలిచిపోయిన వాహనాలు
- గంటల తరబడి ట్రాఫిక్‌లో వాహనదారుల ఇబ్బందులు
- 21వ తేదీ వరకు వాహనాల రాకపోకలు నిలిపివేత


వెంకోజీపాలెం హైవేలో నిలిచిన ట్రాఫిక్


ఇసుకతోట నుంచి మద్దిలపాలెం రహదారిలో ట్రాఫిక్

విశాఖ సిటీ: 'యోగాంధ్ర' విశాఖ వాసులకు చుక్కలు చూపిస్తోంది. బీచ్‌రోడ్డులో వాహనాలను నిషేధించిన తొలిరోజే వాహనదారులకు ప్రత్యక్ష నరకం కనిపించింది. బుధవారం కనీవినీ ఎరుగని రీతిలో హైవేపై ట్రాఫిక్ స్తంభించి పోయింది. ప్రధానంగా మద్దిలపాలెం నుంచి విశాలాక్షినగర్ వరకు వాహనాలతో కదల్లేని పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉంది. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డులో యోగాంధ్ర కోసం కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో బీచ్‌రోడ్డుకు వెళ్లే దారులన్నింటినీ అధికారులు మూసివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం విద్యార్థులు, ఉద్యోగస్తులు సకాలంలో స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాలకు చేరుకోలేకపోయారు. సాయంత్రం ఇంటికి చేరుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు.

21 వరకు ట్రాఫిక్ ఆంక్షలు

యోగాంధ్ర వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు తలమునకలై ఉన్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నగరంలో పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆర్‌కే బీచ్ వద్ద ప్రధాన వేదికతో పాటు పార్క్ హోటల్ వరకు 15 కంపార్ట్‌మెంట్ల పనులు జరుగుతున్నాయి. అలాగే భీమిలి వరకు ఉన్న 26 కిలోమీటర్ల మేర యోగాసనాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో బీచ్ రోడ్డుతో పాటు బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారులన్నింటినీ మూసివేశారు. ఈ కారణంగా హైవేపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ట్రాఫిక్ ఆంక్షలు విధించిన తొలిరోజే హైవేలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. ఈ మూడు రోజులు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచిస్తున్నారు.

కిలోమీటర్ల మేర ట్రాఫిక్

నగరంలో ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కానప్పటికీ.. మద్దిలపాలెం నుంచి డెయిరీ ఫారం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ప్రయత్నించినప్పటికీ.. ఆ రోడ్లు, సందులు కూడా వాహనాలతో కదల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అందరూ తప్పనిసరి పరిస్థితుల్లో హైవేపైనే ప్రయాణించాల్సి వచ్చింది. మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఎండాడ వరకు ఒక్కో జంక్షన్ దాటాలంటే చుక్కలు కనిపించాయి. వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక వరకు పరిస్థితి మరింత దారుణంగా మారింది. పోలీసులు కూడా ఒకవైపు యోగాంధ్రకు వచ్చే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర ప్రముఖుల భద్రతా చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. మరోవైపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టారు. అయితే అనూహ్యంగా పెరిగిన ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఎంత మంది ట్రాఫిక్ పోలీసులు రద్దీ నియంత్రణకు హైరానా పడినా.. వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో నిలిచిపోవాల్సి వచ్చింది. ఎంవీపీ డబుల్ రోడ్డులో ఉదయం అంబులెన్సుకు దారి ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. మొదటి రోజే ఇలా ఉంటే.. మరో మూడు రోజులు ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి నగరవాసులు ఎలా గట్టెక్కుతారో వేచి చూడాలి. దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో.?

క్షమాభిక్షపై ముగ్గురు జీవిత ఖైదీల విడుదల


జైల్ నుంచి విడుదలవుతున్న జీవిత ఖైదీలు

ఆరిలోవ: సుప్రీం కోర్టు ఆదేశాలతో క్షమాభిక్షపై విశాఖ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు జీవిత ఖైదీలు బుధవారం విడుదలయ్యారు. హత్య కేసుల్లో జీవిత ఖైదుపై నాలుగు గోడల మధ్య దశాబ్దానికి పైగా గడిపి, ఎట్టకేలకు బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టారు. 2009 ఫిబ్రవరి 2 నుంచి ఇక్కడ శిక్ష అనుభవిస్తున్న విజయనగరం జిల్లా వంగర మండలం తలగాం గ్రామానికి చెందిన ఎ.కృపారావు, 2010 ఆగస్టు నుంచి ఉన్న కృష్ణా జిల్లాకు చెందిన(ప్రస్తుతం విశాఖపట్నం, మధురానగర్) కేవీఎన్‌వీ ప్రసాద్, 2014 అక్టోబరు 28 నుంచి జీవిత ఖైదులో ఉన్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన వి.కోటేశ్వరరావులకు సత్ప్రవర్తన కారణంగా క్షమాభిక్ష లభించింది. ఈ సందర్భంగా జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు సూచనలతో రాష్ట్రంలో 17 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష లభించిందన్నారు. అందులో విశాఖ కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ముగ్గురు అర్హులయ్యారన్నారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు, నియమ నిబంధనలు పూర్తిచేసి వారిని విడుదల చేసినట్లు తెలిపారు. ఖైదీలు మీడియాతో మాట్లాడుతూ జైల్‌లో వివిధ కర్మాగార, వ్యవసాయ పనులు చేసినట్లు పేర్కొన్నారు. క్షమాభిక్షపై విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జైల్ సూపరింటెండెంట్‌తో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయిప్రవీణ్, సీహెచ్ సూర్యకుమార్ విడుదలైన ఖైదీలకు పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

మౌర్యకు పోర్టు చైర్మన్ అభినందన



మౌర్యను అభినందిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

విశాఖ సిటీ: భారత్ తరఫున అండర్-19 వాలీబాల్ జట్టుకు ఎంపికైన మాస్టర్ మౌర్య నందమూడిని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన సీఏవీఏ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ కోసం ఎంపిక కావడం విశాఖవాసులు గర్వించదగ్గ విషయమన్నారు. మౌర్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ కూడా మౌర్యను అభినందించారు. మౌర్య తండ్రి పోర్ట్‌లో ఉద్యోగిగా ఉన్నారు.

అస్త్రం యాప్‌పై శిక్షణ

విశాఖ సిటీ : యోగాంధ్ర వేడుకలకు పెద్ద ఎత్తున జనసందోహం వస్తుండడంతో రహదారి రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు 182 మంది పోలీస్ సిబ్బందికి గురువారం అస్త్రం యాప్‌పై శిక్షణ ఇచ్చారు. పోలీస్ శాఖ, జీవీఎంసీ అధికారులతో కలిసి అర్కాడిస్ ఐబీఐ గ్రూప్ ఈ శిక్షణ అందజేసింది. యాప్‌లోని ముఖ్యమైన ఫీచర్లను ప్రాక్టికల్ డెమోలు, సిమ్యులేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అస్త్రం, జీపీఎస్ డేటా, సీసీ టీవీ ఫీడ్స్, ఏఐ విశ్లేషణల ద్వారా ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్ మళ్లింపు, సిగ్నల్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయటానికి సహాయపడుతుందని తెలిపారు. ప్రజలు కూడా ఈ యాప్ ద్వారా ట్రాఫిక్ అప్డేట్స్, పార్కింగ్ సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అస్త్రం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రయాణాన్ని సమర్థవంతంగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

సాహస అవార్డుల దరఖాస్తుకు 30 తుది గడువు

ఎంవీపీ కాలనీ: భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో అందించే సాహస అవార్డుల దరఖాస్తు గడువు ఈ నెల 30తో ముగియనుందని జిల్లా యువజన సంక్షేమాధికారి కార్యాలయం తెలిపింది. టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డ్-2024 పేరిట ఈ సాహస అవార్డులను ప్రదానం చేయనున్నారు. అద్భుత పనితీరు, అత్యుత్తమ నాయకత్వ లక్షణాలు, నిర్దిష్ట సాహస విజయం సాధించిన వ్యక్తులు ఈ అవార్డులకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30 లోపు https://awards. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎం కాన్వాయ్ పార్కింగ్ ఏర్పాట్ల పరిశీలన

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబు కాన్వాయ్ పార్కింగ్ ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆధ్యాత్మిక యోగం

సింహగిరిపై 500 మందితో యోగాసనాలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీ భరత్



మాడ వీధిలో యోగాసనాలు వేస్తున్న దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు

సింహాచలం: సింహగిరిపై బుధవారం 500 మందితో యోగాభ్యాసం నిర్వహించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బీచ్ రోడ్డులో జరిగే కార్యక్రమంలో పాల్గొనే దేవస్థానం ఉద్యోగులు, వైదికులు, సంస్కృతోన్నత పాఠశాల, వేద పాఠశాల విద్యార్థులకు అనుభవజ్ఞుల పర్యవేక్షణలో యోగాసనాలు నేర్పించారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడవీధిలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా కార్యక్రమాన్ని ఈవో వి.త్రినాథరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నామని, అందులో భాగంగానే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ బాల్యం నుంచే యోగాసనాలు అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ రమణ, ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రియుడే కాలయముడు?

మహిళ హత్య కేసులో పోలీసుల అదుపులో నిందితుడు?

భీమునిపట్నం: భీమిలి కృష్ణా కాలనీకి చెందిన బంగారు కవిత మృతి కేసు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. భీమిలి బీచ్‌రోడ్డు సమీపంలోని జీడి తోటలో బంగారు కవిత మృతదేహం లభ్యమైన సంగతి తెలిసిందే. ఆమె ప్రియుడే కవితను కిరాతకంగా హత్య చేసి.. నెల రోజులుగా ఏమీ ఎరుగనట్టు నాటకమాడినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. క్రైమ్ సినిమా కథను తలపించేలా సాగిన ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలివి.. కృష్ణా కాలనీకి చెందిన బంగారు కవితకు, భీమిలికి చెందిన పారిశుధ్య కార్మికుడు బొడ్డు రాజుతో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. అయితే గత కొంతకాలంగా వారిద్దరి మధ్య మనస్పర్థలు పెరిగి, తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కవితను అడ్డు తొలగించుకోవాలని రాజు నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం మాట్లాడదామనే నెపంతో గత నెలలో ఆమెను బీచ్‌రోడ్డు సమీపంలోని ఎర్రమట్టి దిబ్బల వద్దకు పిలిపించాడు. అక్కడికి వచ్చిన ఆమెపై రాయితో దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని పక్కనే ఉన్న జీడి తోటలోకి తీసుకెళ్లి, ఒక చెట్టు కొమ్మకు వేలాడదీసి వచ్చేశాడు. ఆ తర్వాత రాజు ఏమీ తెలియనట్టు అందరితో కలిసి తిరుగుతూ, పోలీసులను సైతం తప్పుదోవ పట్టించాడు. కవిత కనబడటం లేదని ఆమె భర్త, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానంతో రాజును పలుమార్లు విచారించారు. అయినప్పటికీ తనకు ఏమీ తెలియదని నమ్మబలుకుతూ దర్యాప్తును పక్కదారి పట్టించాడు. అయితే కవిత మృతదేహం లభ్యమైన తర్వాత పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా ఆధారాలతో బొడ్డు రాజును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, అతడు చేసిన నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ఒక వైపు దారుణ హత్యకు పాల్పడి, మరో వైపు నెలరోజుల పాటు అందరినీ నమ్మించిన రాజు తీరుపై పోలీసులు, స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబమంతా ఉద్యమ బాటే!

- పదేళ్ల క్రితం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అరుణక్క సోదరుడు ఆజాద్
- ప్రజాక్షేత్రంలో ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సోదరి ఝాన్సీ



పెందుర్తి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అరుణక్క కుటుంబమంతా ఉద్యమానికి దగ్గరగా ఉంది. ఆమె స్వస్థలం పెందుర్తి కరకవానిపాలెం. తల్లిదండ్రులు వి.లక్ష్మణరావు ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి శాంతి అలియాస్ అర్జునమ్మ గృహిణి. వీరికి వెంకటరవి లక్ష్మి చైతన్య అలియాస్ అరుణక్క, గోపి అలియాస్ ఆజాద్, ఝాన్సీ సంతానం. చిన్ననాటి నుంచి వామపక్ష భావజాలం కలిగిన అరుణక్క దాదాపు మూడు దశాబ్దాల క్రితమే ఉద్యమంలోకి వెళ్లిపోయింది. అనేక పోరాటాల్లో కీలకంగా వ్యవహరించిన ఆమె అంచెలంచెలుగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ జోనల్ కమిటీ సభ్యురాలుగా ప్రస్తుతం పనిచేస్తోంది. ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతి చెందడంతో కరకవానిపాలెంలోని కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. అరుణక్క సోదరుడు గోపీ అలియాస్ ఆజాద్ కూడా యుక్త వయసులోనే ఉద్యమం వైపు అడుగులు వేశాడు. ఉద్యమంలో చేరిన కొంతకాలానికే గాలికొండ ఏరియా దళ కమాండర్ హోదా దక్కింది. అయితే అదే సమయంలో ఆజాద్ 2016లో గూడెంకొత్తవీధి అటవీ ప్రాంతం మర్రిపాకల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. అరుణక్క సోదరి ఝాన్సీ న్యాయవాది. ప్రజా ఉద్యమంలో చురుగ్గా ఉంటారు. గంగవరం పోర్టు నిర్మాణ వ్యవహారంలో మత్స్యకారులకు, యాజమాన్యానికి మధ్య జరిగిన పోరాటంలో ఝాన్సీ మత్స్యకారులకు అండగా కీలకంగా వ్యవహరించారు. అప్పట్లో ఆమె పోరాటంలో భాగంగా గాయపడితే కేజీహెచ్‌కు తరలించారు. ఆ సమయంలో కేజీహెచ్ బెడ్ మీద ఆమెకు సంకెళ్లు వేసి చికిత్స చేయడం పెద్ద సంచలనంగా మారింది.

నా కుమార్తెను ప్రభుత్వమే చంపింది: లక్ష్మణరావు, అరుణక్క తండ్రి

మారేడుమిల్లిలో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్. నా కుమార్తె(అరుణక్క)ను పోలీసులు కొద్ది రోజుల క్రితమే పట్టుకుని బంధించి ఇప్పుడు హతమార్చారు. దీన్ని ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నాం. గతంలో కూడా నా కుమారుడు గోపీ అలియాస్ ఆజాద్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు. దీనిపై కచ్చితంగా న్యాయపోరాటం చేస్తాం.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎంవీపీ కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తి ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission. samarth. edu. in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు జూలై 15 చివరి తేదీగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా సూచించారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 20న పలు కంపెనీలకు సంబంధించి 137 ఉద్యోగాల భర్తీ కొరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారులు(టెక్నికల్/క్లరికల్) కె.శాంతి, డి.అరుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, పేటీఎం, ఓం సర్వీసెస్, హ్యూమన్ పవర్, తల్వైవార్ స్టీల్, టీం లీజ్(ఎస్‌బీఐ) కంపెనీల్లో ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, లాజిస్టిక్స్, హెల్పర్స్ ఉద్యోగాలకు 18-35 ఏళ్ల మధ్య వయస్కులు హాజరుకావొచ్చన్నారు. జీతం రూ.15 వేల నుంచి రూ.25 వేలు వరకు ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ అర్హతలు కలిగి, ఆసక్తి గల అభ్యర్థులు టీటీటీ.ఎచిటజౌరి. జీ వెబ్‌సైట్ నందు తమ పేర్లు నమోదుచేసుకుని, శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

యోగాంధ్రకు ముమ్మర ఏర్పాట్లు

భద్రత, సుందరీకరణ, ప్రజలకు సౌకర్యాలపై అధికారుల దృష్టి





బీచ్‌రోడ్డులో జరుగుతున్న ఏర్పాట్లు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ నగరం సిద్ధమవుతోంది. ప్రధాని మోదీ పాల్గొననున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కోసం ఆర్.కె.బీచ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన వేదిక ఏర్పాట్లు ప్రణాళికతో చేపడుతున్నారు. అదే సమయంలో రహదారి ఇరువైపులా బారికేట్ల నిర్మాణం పూర్తికావచ్చింది. తీరం వెంబడి ఎల్‌ఈడీ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తి చేశారు. ముఖ్యంగా భద్రత, సుందరీకరణ, ప్రజా సౌకర్యాల కల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు.

సాగర తీరానికి హరిత శోభ

బీచ్ రోడ్డుకు కొత్త అందాలు అద్దేందుకు హార్టికల్చర్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు డివైడర్లపై తాత్కాలిక కుండీలలో ఆరు నుంచి ఎనిమిది అడుగుల పొడవైన పామ్ జాతి మొక్కలను ఏర్పాటు చేశారు. తీరంలోని మహనీయుల విగ్రహాల వద్ద, ఇతర కీలక ప్రాంతాలలో పచ్చని గడ్డితో లాన్‌లను సిద్ధం చేస్తున్నారు. ఆరిలోవలోని ప్రభుత్వ నర్సరీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల మొక్కలతో బీచ్ రోడ్డును హరితమయం చేస్తున్నారు.

భద్రతా వలయంలో బీచ్ రోడ్

ప్రధాని పర్యటన దృష్ట్యా నగరం, ముఖ్యంగా సాగర తీరం పటిష్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. రెండు రోజులుగా పోలీసులు తీరం వెంబడి నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. నగరానికి చేరుకున్న అదనపు పోలీసు బలగాలకు వివిధ ప్రాంతాలలో వసతి కల్పించి, విధులను కేటాయిస్తున్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్, సాగరికలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ల వద్ద వందలాది మంది పోలీసులు పహారా కాస్తున్నారు. బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్‌లో ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

ప్రజల వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు, ట్రాఫిక్ ఆంక్షలు : ప్రధాన వేదిక వద్ద జరిగే కార్యక్రమాన్ని, ప్రధాని ప్రసంగాన్ని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా బీచ్ రోడ్డులో పలుచోట్ల భారీ ఎల్‌ఈడీ తెరలు, సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. భద్రత ఏర్పాట్ల దృష్ట్యా ట్రాఫిక్‌ను కఠినంగా నియంత్రిస్తున్నారు. ఆర్‌కే బీచ్ నుంచి పాండురంగాపురం వరకు వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. వీఎంఆర్డీఏ పార్క్ నుంచి వాల్తేర్ డిపో వరకు కూడా వాహనాల రాకపోకలు నిషేధించారు. ప్రస్తుతం పాండురంగాపురం నుంచి పార్క్ హోటల్ కూడలి వరకు మాత్రమే వాహనాలకు అనుమతి ఉంది. నిషేధిత ప్రాంతాల్లో గ్రీన్ మ్యాట్లు పరచడం, కంపార్ట్‌మెంట్ల నిర్మాణం వంటి పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఆర్‌ఎల్‌సీ సమావేశం 26కు వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్టర్ల అసోసియేషన్లతో రీజనల్ లేబర్ కమిషనర్(ఆర్‌ఎల్‌సీ) మొహంతి సమక్షంలో బుధవారం జరిగిన చర్చలు వాయిదాపడ్డాయి. నగరంలోని ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. దీనిపై ఆర్‌ఎల్‌సీ మాట్లాడుతూ 26లోగా యాజమాన్యం, కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాలు చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. తదుపరి సమావేశాన్ని ఈ నెల 26కు వాయిదా వేశారు.

లేపాక్షి, ఆప్కో ఆధ్వర్యంలో డిజైన్ పోటీలు

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ సంయుక్తంగా రాష్ట్రంలో సంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తుల్లో కొత్త స్మారక చిహ్నాల (సువెనీర్ల) డిజైన్‌లను సృష్టించేందుకు రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలు నిర్వహిస్తున్నాయి. జాతీయ డిజైన్ సంస్థ భాగస్వామ్యంతో ఈ పోటీలు జరుగుతాయని ఏపీహెచ్‌డీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన 18 ఏళ్లు పైబడిన కళాకారులు, నేత కార్మికులు, డిజైనర్లు, విద్యార్థులు, ఇతర ఆసక్తి గల వ్యక్తులు ఈ పోటీలకు అర్హులు. మొత్తం 30 మంది విజేతలకు బహుమతులు అందిస్తారు. హస్తకళల విభాగంలో ఐదుగురికి, చేనేత విభాగంలో ఐదుగురికి మొదటి బహుమతిగా రూ.25,000 చొప్పున అందజేస్తారు. ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు చొప్పున ప్రదానం చేస్తారు. జూలై 16లోపు ఆంధ్రప్రదేశ్‌లోని సమీప లేపాక్షి లేదా ఆప్కో షోరూమ్‌లలో స్మారక చిహ్నాల నమూనాలను అందజేయాలి. పూర్తి వివరాలకు లేపాక్షి వెబ్‌సైట్ https://lepakshihandicrafts. gov. in/, ఆప్కో వెబ్‌సైట్ https:// www. apcofabrics. com ను సందర్శించవచ్చు.

నృత్య కళ.. ప్రతిభ భళా

- కూచిపూడి మణిదీపిక లిఖితసాయి
- పలు రాష్ట్రాల్లో 200 వరకు ప్రదర్శనలు
- 15 ఏళ్లుగా నృత్యకళాకారిణిగా రాణింపు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో...

తగరపువలస : నాట్యకళకు నిలయమైన కూచిపూడి సంప్రదాయంలో చిలుకోటి వెంకట లిఖితసాయి తనదైన ముద్ర వేసుకుంటోంది. గత 15 సంవత్సరాలుగా కూచిపూడి నాట్యసీమలో అప్రతిహతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న ఈ యువ కళాకారిణి, తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలలో 200కు పైగా ప్రదర్శనలు ఇచ్చి కళాభిమానులను మంత్రముగ్ధులను చేసింది. అడుగడుగునా తన ప్రతిభతో ఆకట్టుకుంటూ, కూచిపూడి కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తోంది.

జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలసకు చెందిన 22 ఏళ్ల బీటెక్ విద్యార్థిని చిలుకోటి వెంకట లిఖితసాయి కూచిపూడి నృత్యంలో విశేషంగా రాణిస్తోంది. పద్మావతి పరిణయం నృత్యరూపకాన్ని ఇప్పటివరకు 30 సార్లు ప్రదర్శించగా, అందులో 5 సార్లు శ్రీవారి సన్నిధిలో ప్రదర్శించడం తనకు మరచిపోలేని దివ్యానుభూతిని కలిగించిందని లిఖితసాయి తెలిపింది. కూచిపూడితో పాటు, ఫోక్ డాన్స్‌లలోనూ తన తోటి విద్యార్థినులతో కలిసి తన సత్తా చాటింది.



పురస్కారం అందుకుంటూ..



సాధించిన పతకాలు, తల్లిదండ్రులు హరిబాబు, వెంకటరత్నంతో వెంకట లిఖిత సాయి

విద్యలోనూ ముందంజ

భీమిలి ఐ.ఎన్.ఎస్. కళింగ కేంద్రీయ విద్యాలయంలో 10+2 పూర్తి చేసిన లిఖితసాయి, ఇటీవల భీమిలి మండలంలోని లెండి కళాశాలలో ఈ.సి.ఈ. విభాగంలో బీటెక్ పూర్తి చేసింది. క్యాంపస్ డ్రైవ్‌లో మూడు ఉద్యోగావకాశాలు సాధించినప్పటికీ, తన సోదరుడు వెంకట దినేష్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడంతో, ఆమె ప్రస్తుతం గేట్ పరీక్ష రాయడానికి సిద్ధమవుతోంది.

గురువుల ప్రోత్సాహం, అవార్డులు

ఏడేళ్ల వయసులో తగరపువలసలో నాట్యరవళి డ్యాన్స్ అకాడమీకి చెందిన ఉమ్మిడి మహేష్‌బాబు వద్ద శిష్యరికం ప్రారంభించిన లిఖితసాయి, అంచలంచెలుగా ఎదిగి పలుచోట్ల ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరుకుంది. లాక్‌డౌన్ సమయంలో చెన్నైకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత భరత నాట్య కళాకారిణి హరిణి జీవిత తన జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసిందని లిఖితసాయి చెప్పుకొచ్చింది.

23న సత్కారం

కళారంగ సేవలకు గుర్తింపుగా ఈ నెల 23న ఇందు 5 స్టార్ అసోసియేషన్ లిఖితసాయిని విశాఖ లైబ్రరీలో ఘనంగా సత్కరించనుంది. ఇప్పటికే ఆమెకు 2022లో క్లాసికల్ డ్యాన్స్‌కు సంబంధించి యూత్ ఆఫ్ ఎక్సలెన్స్ వారి ఎఫ్.ఎఫ్.ఎ. ఉగాది పురస్కారం, 2021లో ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్‌లో భాగంగా నాట్య అభినయ అవార్డు, 2023-24లో జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యూత్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి లభించాయి. ప్రస్తుతం కూచిపూడిలో సర్టిఫికెట్ ఎగ్జామ్ రాస్తున్న లిఖితసాయి, డిప్లమో, ఎం.ఎ. కూడా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది.

తల్లే తొలిగురువు..

కూచిపూడి నృత్యంలో ప్రతిభ చూపుతున్న చిలుకోటి వెంకట లిఖితసాయి విజయం వెనుక ఆమె తల్లి వెంకటరత్నం ప్రోత్సాహం ఎంతో ఉంది. తాను పూర్తిస్థాయిలో నృత్యం నేర్చుకోలేకపోయాననే ఆవేదనను తన కుమార్తె ద్వారా తీర్చుకుంటున్నారు వెంకటరత్నం. లిఖితసాయి ఎక్కడ ప్రదర్శన ఇచ్చినా, ఆమె వెంట ఉండి చీర కట్టడం, జడ అల్లడం వంటి పనులను స్వయంగా చూసుకుంటారు. కుమార్తె కళా ప్రదర్శనలకు తల్లిదండ్రులు ఎంతగానో ప్రాధాన్యతనిస్తున్నారు. లిఖితసాయి చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే, ఆమెకు ఇష్టమైన కళారంగంలో పూర్తి మద్దతు అందిస్తున్నారు. వారి ప్రోత్సాహంతోనే లిఖితసాయి నృత్య రంగంలో ఉన్నత స్థాయికి చేరుకుందని చెప్పొచ్చు.



పద్మావతి కల్యాణం ప్రదర్శనలో..



సత్యభామగా...